
నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

సుభాష్‌నగర్, సెప్టెంబరు 23: నగరంలోని డి-2 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని నగర టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ తెలిపారు. డి-2 సెక్షన్ పరిధిలోని రాష్ట్రపతి రోడ్, గాంధీచౌక్, హెడ్ పోస్టాఫీస్, నెహ్రూపార్క్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టనున్నామన్నారు. ఉదయం 8గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



- ప్రభుత్వ బోనస్ ప్రకటనతో జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం
- వానాకాలం సాగులో 85 శాతం సన్నరకం వరినే సాగు చేసిన రైతులు
- సుమారు 10.49 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా
- అక్టోబర్ మొదటి వారం నుంచి కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం
- జిల్లా వ్యాప్తంగా 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ధాన్యం నిల్వ కోసం ముందస్తుగా గోదాములను సిద్ధం చేస్తున్న అధికారులు



గణనీయంగా సన్నాల సాగు



నిజామాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ ప్రకటించడంతో జిల్లాలో గణనీయంగా సాగు పెరిగింది. వానాకాలంలో మొత్తం సాగులో 85 శాతం సన్నరకం వరినే రైతులు సాగు చేశారు. జిల్లాలో వేసిన ఈ పంట పొట్ట, చివరి దశలో ఉండగా కొన్ని గ్రామాల పరిధిలో వరి చేతికి రావడంతో పంటను కోస్తున్నారు. జిల్లాలో అక్టోబరు మొదటి వారం నుంచి ఎక్కువ మొత్తంలో రైతులు పంటను కోయనుండటంతో అధికారులు కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పంట దిగుబడిని అంచనా వేస్తూ ముందుగా చేతికి వచ్చే గ్రామాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలుకు అవసరమైన సామగ్రిని సమకూర్చడంతో పాటు నిల్వ చేసేందుకు గోదాంలను సిద్ధం చేస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని అన్ని రైస్‌మిల్లులకు కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సన్నరకం ధాన్యమే ఎక్కువగా దిగుబడి రానుండటంతో మద్దతు ధరతో పాటు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా క్వింటాలుకు 500 రూపాయలు ఇవ్వనుండటంతో ఈ దఫా ఎక్కువ మొత్తంలో కొనుగోలు కేంద్రానికి ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఈ ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలు ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన అధికారులు అక్టోబర్ నుంచి నవంబరు చివరి వరకు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

వానాకాలంలో భారీగా వర్షాలు

జిల్లాలో ఈ వానాకాలంలో వర్షాలు భారీగా పడటంతో సన్నరకాల సాగు భారీగా పెరిగింది. జిల్లాలో ఈ వానాకాలంలో మొత్తం 4లక్షల 29వేల ఎకరాలల్లో వరిసాగు అయింది. జిల్లాలో సాగైన మొత్తం వరి విస్తీర్ణంలో 85 శాతం వరకు సన్నరకాలను రైతులు సాగు చేశారు. జిల్లాలో సాగైన వరి విస్తీర్ణం ప్రకారం సుమారు 11.94 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ ధాన్యంలో సుమారు 8లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానుండటంతో మొత్తం అన్ని గ్రామాల పరిధిలో కేంద్రాలను ఏర్పాటు చేసి కొనేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వానాకాలంలో సన్న రకాలే ఎక్కువగా సాగు కావడం వల్ల జిల్లాలో 10.49 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకు వచ్చారు. దొడ్డురకం ఒక లక్షా 89వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనాకు వచ్చారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాట్లు చేయాలని ముందస్తుగా ఆదేశాలు ఇవ్వడంతో జిల్లాలో ఇప్పటికే పలు దఫాలు కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షించారు. దిగుబడికి అనుగుణంగా కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం మద్దతు ధర ఏగ్రేడ్ రకానికి క్వింటాలు 2320 రూపాయలు ఉండగా సాధారణ రకానికి క్వింటాలు 2300 రూపాయలుగా నిర్ణయించారు. జిల్లాలో పండించిన సన్న రకం ధాన్యం సాధారణ రకానికి వస్తుంది. ఈ సంవత్సరం ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ ప్రకటించడంతో ఎక్కువ మంది ఈ పంటను సాగు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో 8లక్షల మెట్రిక్ టన్నుల వరకు చేయాలని నిర్ణయించగా దీనిలో ఎక్కువ మొత్తం సన్నరకాలు వస్తుందని అంచనాకు వచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముందస్తుగానే ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన ఇంకా కొనుగోలుకు సంబంధించిన మార్గదర్శకాలను, నిబంధనలను విడుదల చేయలేదు. ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌తో పాటు ఈ మార్గదర్శకాలను విడుదల చేయనుంది. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగానే జిల్లాలో అక్టోబర్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధం


జిల్లాలో ఈ సంవత్సరం దిగుబడి గత సంవత్సరం లాగానే ఎక్కువగా రానుండటంతో జిల్లా వ్యాప్తంగా వరి పండించే అన్ని గ్రామాల్లో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో ఈ దఫా మొత్తం 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 388 కేంద్రాలు, ఐకేపీ ద్వారా 52, డీసీఎంఎస్ ద్వారా 29, మెప్మా ద్వారా 6, ఇతర సంఘాల ద్వారా 5 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వచ్చిన రీతిలోనే టోకెన్‌లను ఇచ్చి కొనుగోలు చేయనున్నారు. అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభించి నవంబరు చివరి వరకు ధాన్యం చేతికి వచ్చిన రీతిలో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులను కూడా సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న స్టాక్‌తో పాటు జిల్లాకు మొత్తం 2కోట్లకు పైగా గన్నీ బ్యాగులు అవసరం ఉండటంతో వాటిని తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గన్నీ బ్యాగులకు సంబంధించిన ఇండెంట్‌లను ప్రభుత్వానికి పంపించారు. కొనుగోలుకు అవసరమైన సామాగ్రిని సమకూర్చడంతో పాటు ధాన్యం తూకం వేసేందుకు అవసరమైన హమాలీలను సిద్ధం చేస్తున్నారు. ధాన్యం తూకం వేయడంతో పాటు తరలిం చేందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ట్రాన్స్‌పోర్ట్‌లతో సమీక్షించి అవసరమైన వాహనాలను సమకూర్చాలని కోరారు.

రైస్‌మిల్లులకు కేటాయించనున్న ధాన్యం

జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని గతంలాగే రైస్ మిల్లులకు కేటాయించనున్నారు. ఈ దఫా రైస్‌మిల్లర్లు తడిచిన, పచ్చి ధాన్యాన్ని తీసుకునేందుకు నిరాకరించడం ఇప్పటికే అసోసియేషన్ తరఫున అధికారులకు లేఖలు ఇవ్వడంతో ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఆయా మిల్లుల కెపాసిటీ ప్రకారం ఈ ధాన్యాన్ని కేటాయించనున్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ గోదాముల్లో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గోదాముల్లో ధాన్యం నిల్వలు ఉంచేందుకు ముందస్తుగానే ఏర్పాట్లు చేస్తున్నారు. రైస్‌మిల్లుల ధాన్యంతో పాటు వ్యాపారుల ధాన్యం ఉంటే వాటిని తరలిస్తున్నారు. సన్నరకాలు ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ మొత్తంలో రైతులు బోనస్‌కు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురానుండటంతో ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంతో పాటు రైస్‌మిల్లర్లతో చర్చించి ధాన్యం కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో లాగా ధాన్యంపై కేటాయింపుల్లో నిర్లక్ష్యంగా ఉండకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో అక్టోబర్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని జిల్లా పౌరసరఫరాల శాఖ, సంస్థ అధికారులు అర్వింద్‌రెడ్డి, రమేష్ తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఈ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సారి సన్నరకాలు ఎక్కువగా వేసినందున కొనుగోలు కేంద్రాలకు ఆ ధాన్యమే ఎక్కువగా వస్తుందని అంచనా వేస్తున్నట్లు వారు తెలిపారు.

ధాన్యం కేటాయింపుపై నజర్..

ఈ సీజన్ నుంచి రైస్‌మిల్లర్లకు కేటాయించే ధాన్యంపై పూర్తిస్థాయిలో నజర్ పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. గతంలోలాగా ప్రభుత్వం నుంచి వచ్చే నిబంధనలను అనుసరించి కస్టం మిల్లింగ్ చేసి ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రైస్‌మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని ట్యాగ్ చేయడంతో పాటు నిర్ణీత సమయంలో బియ్యం ఇవ్వని మిల్లులపై చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో గతంలో కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టడం, సుమారు 250కోట్ల విలువైన ధాన్యంకు సంబంధించి బియ్యాన్ని ఇప్పటి వరకు అందించకుంటే కొన్ని మిల్లులపై కూడా కేసులు పెట్టారు. ప్రస్తుతం వాటి నుంచి బియ్యాన్ని తీసుకుం టున్నారు. ఈ వానాకాలంలో కేటాయించే ధాన్యానికి కూడా గ్యారంటీ తీసుకొని కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



న్యూ ఢిల్లీలో సోమవారం భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను ఎంపీ ధర్మపురి అర్వింద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిపై పలు విషయాలు చర్చించారు.

ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల

- ప్రాజెక్టులోకి 14వేల క్యూసెక్కుల వరద

మెండోర, సెప్టెంబరు 23: ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 14వేల 170 క్యూసెక్కుల వరద చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం గరిష్ఠస్థాయికి చేరింది. దీంతో ప్రాజెక్టు ఎస్కేప్ గేట్లను ఎత్తి గోదావరిలోకి రెండు వేల క్యూసెక్కుల నీటిని, వరదకాలువ ద్వారా 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రాజెక్టులోకి ఉదయం స్వల్పంగా వరద చేరగా ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా నీటని విడుదల చేశారు. సాయంత్రం ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి వరద పెరగగా ఎస్కేప్ గేట్లను ఎత్తి గోదావరిలోకి రెండు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఆరు వేల క్యూసెక్కుల, అలీసాగర్ , గుత్పకు 180 క్యూసెక్కుల ఆవిరి రూపంలో 700క్యూసెక్కుల నీరు విడుదల జరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (80.5 టీఎంసీ)లు కాగా సోమవారం సాయంత్రానికి 1091.00 అడుగులు (80.501 టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 188టీఎంసీల నీరుచేరగా ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రధాన కాలువల ద్వారా 115టీఎంసీల నీరు విడుదల చేశారు.



ప్రాజెక్టు నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి కొనసాగుతున్న నీటి విడుదల

ఐటీఐలలో ఐదవ ఫేజ్ అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 23: తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఐటీఐలలో ఉచితంగా అడ్మిషన్లు పొందేందుకు 2024 విద్యాసంవత్సరానికి గాను ఐదవ ఫేజ్ అడ్మిషన్లు ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభమయ్యాయని జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ బాలుర ప్రిన్సిపాల్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు అర్హులని, అడ్మిషన్‌లకు వయస్సు పరిమితి లేదని వివిధ కోర్సుల వివరాలకు, విద్యార్హతకు ఐటిఐ.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. జిల్లాలోని ఐదు ప్రభుత్వ, మూడు ప్రైవేటు ఐటిఐలలో మిగిలిన సీట్లకు కొత్త అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలన్నారు. మొదటి ఫేజ్ నుంచి నాల్గవ ఫేజ్ వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఈనెల 25 నుంచి 28 వరకు ఉదయం 11 గంటలలోపు కోరుకున్న ఐటీఐలలో స్పాట్ అడ్మిషన్ల కోసం నేరుగా హాజరు కావాలని ఒకవేళ ఆ ఐటీఐలలో మెరిట్ ప్రకారం ఆరోజు అభ్యర్థికి సీటు రాకుంటే సీట్లు ఖాళీగా ఉన్న ఇతర ఐటీఐలలో మరుసటి రోజు హాజరు కావచ్చన్నారు. ఇతర వివరాలకు 9948195654, 9490057403 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా ఊర పండుగ

మోపాల్, సెప్టెంబరు 23: మండలంలోని మంచిప్ప గ్రామంలో సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతీ సంవత్సరం గ్రామదేవతలకు పూజించుకోవడం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. ఊరపండుగ రోజు గ్రామదేవతల ఆలయాల వరకు మహిళలు బోనాలతో వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. వేసిన పంటలు కోతకు వచ్చే సమయంలో గ్రామదేవతలను పూజించుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు తెలిపారు. ఊరపండుగలో అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామ దేవతలకు పూజలు చేస్తున్న భక్తులు



పోటాపోటీ

- ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ
- ఎవరికివారే ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు
- సీనియార్టీ, పార్టీకి చేసిన సేవలను వివరిస్తున్న ఆశావహులు
- ఆర్మూర్‌లో వేడెక్కుతున్న మార్కెట్ కమిటీ రాజకీయం



ఇస్సాపల్లి జీవన్



సాయిబాబాగౌడ్


ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 23: ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి తీవ్రపోటీ నెలకొంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇదివరకు పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఇస్సాపల్లికి చెందిన జీవన్, ఆర్మూర్ పట్టణానికి చెందిన సాయి బాబాగౌడ్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. జీవన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాగా, సాయి బాబాగౌడ్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు. ఇద్దరు పార్టీలో సీనియర్‌లే కావడంతో ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల వరకు స్తబ్దతగా ఉన్న ఆర్మూర్ నాయకుల్లో కదలిక వచ్చింది. దీంతో ఒక్కసారిగా మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకంపై జోరుగా చర్చ జరుగుతోంది. కమ్మర్‌పల్లి, వేల్పూర్, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్‌లు ఖరారు కావడంతో త్వరలోనే ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను ప్రభుత్వం నియమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎవరికి వారే ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆశావహులు పార్టీ పెద్దలను కలుస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీకి చేసిన సేవలు, సీనియార్టీని వివరిస్తున్నారు. తమకు కేటాయించాలని కోరుతున్నారు.

1972లో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు

ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్‌ను 1972 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1991లో దేవమల్లయ్య మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. అనంతరం 2000-2001 సంవత్సరంలో దశరథ్‌రెడ్డి, ఆ తర్వాత కొత్తపల్లి నడ్పన్న, సిరిపురం బోజారెడ్డి, యామాద్రి భాస్కర్లు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. గత మూడేళ్లుగా కమిటీకి పాలకవర్గ సభ్యులు లేరు. మార్కెట్ కమిటీ వ్యాపార పరంగా నామమాత్రంగానే ఉంటోంది. మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరగడంలేదు. మార్కెట్ పరిధిలో ఆర్మూర్, జక్రాన్‌పల్లి మండల పరిధిలోని సుమారు 40గ్రామాలు ఉన్నాయి. పరిధిలోని ఏ గ్రామంలోనైనా వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగితే మార్కెట్ కమిటీకి సెస్ రూపంలో ఆదాయం లభిస్తుంది. ఇది కూడా లక్షల్లోనే ఉంటుంది.

సీనియారిటీపైనే ఆశలు..

మార్కెట్ పదవి దక్కడానికి కాంగ్రెస్ పార్టీలో సీనియారిటీ ప్రకారం తమకే వస్తుందని ఇద్దరు ఆశావహులు నమ్మకంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉంటున్న తమకు అధిష్ఠానం మార్కెట్ కమిటీ పదవిని కట్టబెడుతుందన్న ఆశాభావంతో సాయిబాబాగౌడ్ ఉన్నారు. పదవి పొందేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. 25ఏళ్లుగా పార్టీలో పని చేస్తున్నానని, పదేళ్ల పాటు అధికారంలో లేనప్పటికీ పార్టీ కార్యక్రమాలను, ఆందోళనలో ముందుండి నడిచానని గుర్తు చేస్తున్నారు. నిస్వార్థంగా పార్టీకి సేవ చేసినందు వల్ల తనకే చైర్మన్ పదవి వస్తుందన్న నమ్మకంతో సాయిబాబాగౌడ్ ఉన్నారు. అదే విధంగా పార్టీని అంటిపెట్టుకొన్ని 30ఏళ్ల పాటు ఉండి సేవలు చేశానని, ఎవరు ఎంత ప్రలోభాలు పెట్టినా.. పార్టీని వీడలేదని, అన్ని కార్యక్రమాల్లో ముందుండి సేవలు చేసిన దృష్ట్యా పార్టీ తన సేవలను గుర్తించి చైర్మన్ పదవి కట్టబెడుతుందని ఇస్సాపల్లి జీవన్ ఆశాభావంతో ఉన్నారు. మాక్లూర్, నందిపేటలో పార్టీకి చెందిన సీనియర్ నాయకులకు నిజామాబాద్ మార్కెట్ కమిటీలో డైరెక్టర్లుగా నియమించారని, అదే విధంగా తనకు కూడా అవకాశం వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో, అదృష్టం ఎవరిని వరించనుందో త్వరలోనే తేలనుంది.



ప్రజావాణి కార్యక్రమానికి 97 వినతులు

- వినతులను స్వీకరించిన కలెక్టర్
- సత్వరమే పరిష్కరించాలని

అధికారులకు ఆదేశం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 23: నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈవారం 97 వినతులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, అదనపు ఎస్పీ బస్వారెడ్డిలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడూ పరిశీలన జరుపుతూ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు వచ్చిన మునిపల్లి దళితులు..

జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామంలో దళితుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళితులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు నచ్చన్న మాట్లాడుతూ మాదిగ కులానికి చెందిన తనకు ఎకరం భూమి ఉందని కానీ ఆ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసి శివలింగం ప్రతిష్ఠాపన చేశారని ఇదేమిటని అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. కొందరు రాజకీయ నేతలు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని 12 మందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామానికి చెందిన సుమారు 50 మంది దళిత ప్రతినిధులు కలెక్టరేట్‌కు వచ్చారు.


కలెక్టరేట్‌లో ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

పెన్షన్ ఇప్పించండి..

మోపాల్ మండలం చిన్నాపూర్‌కు చెందిన కమ్మయి రిషిత్ (9) తనకు పెన్షన్ ఇప్పించాలని కోరుతూ కలెక్టరేట్‌కు వచ్చాడు. తాను నరాల బలహీనతతో బాధపడుతున్నానని తనకు సదరం సర్టిఫికెట్‌లో వికలాంగత్వం చూపుతూ సర్టిఫికెట్ ఇచ్చారని కానీ పెన్షన్ రావడం లేదని కోరాడు. ఆమె తల్లితో కలిసి వచ్చిన రిషిత్ తనకు పెన్షన్ ఇప్పించాలని కోరాడు.


జిజిహెచ్‌లో నిధుల దుర్వినియోగంపై అధికారులు స్పందించాలి..

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని దుర్వినియోగ నిధులను రికవరీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ) నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదు ట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ తరచూ అక్రమాలు జరుగుతున్నట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయని, ఆరోగ్యశ్రీ విభాగంలో 10 కోట్లు నష్టం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని కావున వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, మురళి, విఠల్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట మునిపల్లి దళితులు


పింఛన్ కోసం కలెక్టరేట్‌కు వచ్చిన రిషిత్





అక్టోబరుపైనే అందరి ఆశలు..

● ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదల ఎదురుచూపులు ● రేషన్ కార్డుల జారీ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు

మద్నూర్, సెప్టెంబరు 23: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్ కార్డులను అక్టోబరు నెలలో ఇస్తామని ప్రకటించ డంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల చూపు అక్టోబర్‌పై పడింది. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అక్టోబర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పథకాన్ని ప్రారంభించేందుకు నిర్ణయించినట్లు సమా చారం. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు సైతం అక్టోబర్ నెలలో మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వం ప్రకటించ డంతో అందరి ఆశలు అక్టోబర్‌పైనే ఉన్నాయి. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్రంలోని పేద బడుగు, వర్గాలకు సొంతింటిని ని ర్మించి ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. అయితే ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తుండగా ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు. అక్టోబర్ నెలలో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 45 రోజుల్లోగా ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు వేస్తామని జూలై 30న రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భువనగిరిలో ప్రకటించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 నిర్మించి పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. దీంతో మొదటి దశలో ఇందిరమ్మ ఇళ్లను దక్కించుకోవాలని పేదలు ఎదురు చూస్తున్నారు. అదే విధంగా అక్టోబర్ 2 నుంచి కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామన్న ప్రభుత్వం ప్రకటనతో వేలాది మంది బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రేషన్ కార్డుల్లో తప్పొప్పులు సరి చేయాలంటూ గతంలో పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. వీరంతా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అన్నింటికీ రేషన్ కార్డు ప్రమాణం కావడంతో రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. కార్పొరేట్ దవాఖానాల్లో వైద్యం పొందాలన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందాలన్న ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణానికి విద్యార్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఇలా ఏ పథకానికి లబ్ధి పొందాలన్న రేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకుంటున్నారు. దీంతో రేషన్ కార్డు ప్రజలకు అత్యవసరమవుతుంది. వీటిని పొందడానికి మండల రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. ఇటీవల కొత్త రేషన్ కార్డులు అక్టోబర్ రెండు నుంచి దరఖాస్తులు స్వీకరస్తామని ప్రకటించడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి.



పేదల ఇళ్ల కోసం కేటాయించిన పట్టా భూమి





బాలాజీ జెండాకు భక్తుల పూజలు

మద్నూర్, సెప్టెంబరు 23: మండల కేంద్రంలో బాలాజీ జెండాకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది మహారాష్ట్ర నుంచి తిరుపతి వెళ్లే జెండా మద్నూర్ మండల కేంద్రంలో 11 రోజుల పాటు పూజలు అందుకుంటుంది. అందులో భాగంగా మద్నూర్‌లో గత నాలుగు రోజులుగా బాలాజీ జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమానికి చుట్టూ పక్కల గ్రామాలతో పాటు మండల కేంద్రానికి చెందిన భక్తులు దర్శనానికి వస్తున్నారు. పదకొండు రోజుల పాటు బాలాజీ జెండాకు మండల కేంద్రంలో పూజలు అందుకుంటుందని 30 సంవత్సరాల నుంచి మహారాష్ట్ర నుంచి తిరుపతి వెళ్లే భక్తుడు జెండాను మోసుకొచ్చి మండల కేంద్రంలో పూజలు అందుకుంటున్న అనంతరం తిరుపతికి తీసుకెళ్తారని నిర్వాహకులు తెలిపారు. పదకొండు రోజులలో భాగంగా మహిళలతో కుంకుమార్చన అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు బాలాజీ జెండా దర్శనం చేసుకోవాలని కోరారు.

ఆలయంలో శివలింగ ప్రతిష్ఠాపన

బీర్కూర్, సెప్టెంబరు 23: మండలంలోని బరంగేడ్గి గ్రామంలోని శివ లింగేశ్వర ఆలయంలో సోమవారం శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో గణపతి, శివలింగం, నంది విగ్రహాలను ప్రతిష్ఠించారు. కోటగిరికి చెందిన మదన్ విజయ్‌కుమార్ అనే భక్తుడు విగ్రహాలను ఇప్పించారు. శివానందం చారి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 23: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామంలో పంచాయతీ సిబ్బంది సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని వివిధ వార్డుల్లో ప్రస్తుత వర్షాకాలంలో పెరిగిన పిచ్చి మొక్కలను, పొదలు, కూలీలతో తొలగిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు.

అంగన్‌వాడీలో నాణ్యమైన భోజనం అందించాలి

పిట్లం, ఆగస్టు 23: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని, నిర్లక్షం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. సోమవారం రాంపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం, ఉన్నత పాఠశాలను డీఎల్‌పీవో తనిఖీ చేశారు. అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారుల హాజరుపట్టిక, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

నేలకొరిగిన పంటల పరిశీలన

లింగంపేట, సెప్టెంబర్ 23: మండలంలోని పొల్కంపేట, కన్నాపూర్, పోతాయిపల్లి, కోట్‌పల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు నేలకొరిగిన వరి పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్‌తో పాటు ఏఈవోలు పరిశీలించారు. మొత్తం 29మంది రైతులకు చెందిన 42 ఎకరాలల్లో పంట నష్టం జరిగినట్లు వారు తెలిపారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలి

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పునఃప్రారంభించి రైతులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించేలా చూడాలని కార్మికసంఘాల నాయకులు నాగేశ్వర్ రావు డిమాండ్ చేశారు. సోమవారం బోధన్‌లోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులు, కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. లేఆఫ్ అయిన నాటి నుండి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించి ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలన్నారు. వేతనాలు లేక కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇకనైన ప్రభుత్వం స్పందించి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునఃప్రారంభించి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు బాలకృష్ణ, జల్లయ్య, నయిమొద్దీన్, వికారోద్దీన్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

'వీఆర్‌ఏల వారసులను ప్రభుత్వం ఆదుకోవాలి'

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: రెవెన్యూ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్‌ఏల వారసులు, కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వీఆర్‌ఏ వారసుల బోధన్ డివిజన్ అధ్యక్షులు కరుణాకర్ అన్నారు. సోమవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన వీఆర్‌ఏ వారసుల డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20వేలకు పైగా వీఆర్‌ఏలు ఉండగా అందులో 16వేలకు పైగా వీఆర్‌ఏలకు జీవో 81, 85ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించి మరో 3797మందిని మరిచిందన్నారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులు, కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ప్రభుత్వం తక్షణమే అమలు చేసి ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లాల్లో 400మంది వీఆర్‌ఏలు 61సంవత్సరాలు పైబడిన వారున్నారని వారి వారసులు మరోసారి ఉద్యమించక తప్పదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వీఆర్‌ఏల వారసులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు రత్నకర్, రాజు, శివ, మన్సూర్, లక్ష్మణ్, శ్రీను, హన్మాండ్లు, నర్సింలు, హన్మంతు, పర్వవ్వ, గోపి, సాయికుమార్ పాల్గొన్నారు.

'శాస్త్రీయబద్ధంగా ఆలోచించాలి'

నవీపేట, సెప్టెంబరు 23: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికల పాఠశాలలతో పాటు స్కాలర్స్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సోమవారం లీప్ సంవత్సరం, మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు విజయానంద రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్రీయబద్ధంగా ఆలోచించి, విద్యార్థులకు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మ్యాజిక్‌ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్కాలర్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, లిటిల్ ఫ్లవర్ పాఠ్యశాల కరస్పాండెంట్ హన్మాండ్లు, జనవిజ్ఞాన వేదిక నాయకులు సంజీవ్, రాజశేఖర్, భూమారావు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సన్మానం

నవీపేట, సెప్టెంబరు 23: ఇటీవల మండలంలోని బినోలలో జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో 9బహుమతులు పొందిన జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్ పాఠశాలకు చెందిన క్రీడాకారులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులను పీఈటీ, ఇతర ఉపాధ్యాయులను వీడీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్, లక్ష్మణ్, సురేష్ తదితరులున్నారు.

వరిపంటను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారి

నవీపేట, సెప్టెంబరు 23: మండలంలోని సిరన్‌పల్లి, జన్నేపల్లిలలో సోమవారం వరిపంటలను ఏవో నవీన్ కుమార్ పరిశీలించారు. వరిపంటకు సోకిన బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ, కంకినల్లి, మానిపండు తెగులు, కాండం తొలుచు పురుగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఏవో నవీన్ కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రాజాహస, రైతులు సంజీవ రావు, వీరేందర్ రావు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

ఉత్తమ పాఠశాల జాబితాలో లిల్లిపుట్

పెర్కిట్, సెప్టెంబరు 23: రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలల జాబితాలో లిల్లిపుట్ స్కూల్ ఎక్సిలేన్స్ ఆర్మూర్ చోటు చేసుకుందని కరస్పాండెంట్ రామకృష్ణ తెలిపారు. నూతన బోధన మేళకువలు, కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా అవలంబిస్తున్న ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఉపకరణాలను ఉపయోగిస్తూ పాఠ్యంశాలను బోధిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా అవార్డు దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసినందుకు గాను ప్రొఫెసర్ అమృత్‌రావు ఎడ్యూకేషన్ సొసైటీ వారికి కరస్పాండెంట్ రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

లక్కోరలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌కు సన్మానం

వేల్పూర్, సెప్టెంబరు 23: వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో సోమవారం నూతనంగా ఎన్నికైన వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డిని కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామాల రైతులకు అన్ని విధాల అండదండగా ఉంటూ సేవలందించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ చేపూర్ గంగాధర్, మాజీసర్పంచ్ పెద్ద హన్మాండ్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆత్మరాం, చిన్న హన్మాండ్లు, ఆర్మూర్ మోహన్ ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు23: ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వినయ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. అదే విధంగా వినయ్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కలువగా ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నవీపేట, సెప్టెంబరు 23: మండలంలోని అబ్బాపూర్(ఎం)కు చెందిన గైని రుక్మాబాయి (64) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఏఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 20న తన ఇంటికి చెందిన విద్యుత్ సర్వీస్ వైరును కోతులు తెంపివేయగా తెగిపోయిన విద్యుత్ వైరు ఇంటి ముందు వేలాడిందన్నారు. వేలాడుతున్న సర్వీస్ వైరును రుక్మాబాయి పక్కకు తొలగించబోగా ఆమెకు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలపాలైందని అన్నారు. వెంటనే 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కుమారుడు పద్మారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు దొంగల పట్టివేత

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: బోధన్ పట్టణ శివారులోని రాజీవ్‌గృహ కల్ప వద్ద కిరాణ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగిన ఘటనలో ఇద్దరు దొంగలతో పాటు 5వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆటోనగర్ రాజీవ్‌గృహకల్ప సమీపంలో ఆదివారం రాత్రి తబసుమ్ అనే మహిళకు చెందిన కిరాణ షాపులో దొంగతనం జరిగిందని సోమవారం ఉదయం ఆమె ఫిర్యాదులో పేర్కొందన్నారు. వెంటనే సీఐతో పాటు తమ పోలీసు బృందంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడే అన్ని కోణాల్లో విచారణ చేపట్టి రాజు, రాము అనే ఇద్దరు దొంగలను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 5వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సోమవారం సాయంత్రం దొంగలను కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

తడి,పొడి చెత్తపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ అధికారులు సోమవారం తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు ఆదేశాల మేరకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పలు వార్డులతో పాటు పాఠశాలలో తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించి స్వచ్ఛతాహీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ నర్సయ్య, మున్సిపల్ సిబ్బంది గోపి, ప్రశాంత్, అక్షయ్, రవి, సంతోష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

కోటగిరి, సెప్టెంబరు 23: గత ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతులు మార్కెట్ కమిటీలో దాచుకుంటే ఆ ధాన్యాన్ని మార్కెట్ కమిటీ అధికారులు తిరిగి ఇవ్వకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కోటగిరి మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. కోటగిరి మార్కెట్ కమిటీ గోదాములో 48 మంది రైతులు ఏడాది క్రితం ఖరీఫ్ ధాన్యాన్ని సుమారు 2వేల క్వింటాళ్ల ధాన్యాన్ని నిల్వచేశారు. ధాన్యం నిల్వ చేసే సమయంలో రైతులు 40 కిలోల బస్తాలతో కూడిన ధాన్యాన్ని నిల్వచేశారు. ఆ సమయంలో మార్కెట్ కమిటీ అధికారులు ఎలాంటి నిబంధనలు పెట్టకుండా ధాన్యం నిల్వచేశారు. ఆరు నెలల్లోగా ధాన్యం తిరిగి రైతులు తీసుకోవాల్సి ఉండగా అధికారులు పలు కారణాలతో ధాన్యం తిరిగి ఇవ్వలేదు. మరికొంత మంది రైతులు 40కిలోల బస్తాలతో కూడిన ధాన్యం నిల్వ చేసుకున్నారు. ఆ ధాన్యంపై రుణం తీసుకున్నారు. రుణం చెల్లించి ధాన్యం చెల్లించే క్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు సీఎంఆర్ ధాన్యం పేరుతో ధాన్యం తిరిగి ఇవ్వలేదు. రైతులు కోర్టును ఆశ్రయించి మార్కెట్ కమిటీలో తీసుకున్న రుణం చెల్లించి ధాన్యం తిరిగి తీసుకున్నారు. రుణం తీసుకోని రైతులు మాత్రం తమ ధాన్యం తిరిగి ఇవ్వాలని కార్యాలయం చుట్టు తిరిగిన కార్యదర్శి ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పలు కారణాల పేరుతో కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల ధాన్యాన్ని తిరిగి చెల్లించాలని ఏకగ్రీవ తీర్మానం చేసింది. చెల్లిస్తామని చెప్పిన కార్యదర్శి స్పందించకపోవడంతో మరోమారు రైతులు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోటగిరి తహసీల్దార్ గంగాధర్‌ను ఆదేశించారు. ధాన్యం నిల్వ అంశాన్ని తహసీల్దార్ విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించి ధాన్యం రిలీజ్ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కార్యదర్శి నిర్లక్ష్య వైఖరిపై చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ : ఒకరి మృతి

బోధన్ రూరల్, సెప్టెంబరు 23: బోధన్ మండలంలోని సాలూర, హున్స గ్రామాల మధ్య సోమవారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కొడుకు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సంఘటనకు సంబంధించి బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హున్స గ్రామానికి చెందిన కట్టిగాల సంజీవ్(45) అనే వ్యక్తి తన కుమారుడు అనిల్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై హున్స నుంచి బోధన్ వైపు వస్తుండగా సాలూర మండల కేంద్రం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న స్కార్పియో వాహనం ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాద ఘటనలో తండ్రి సంజీవ్ అక్కడికక్కడే మృతిచెందగా కొడుకు స్వల్ప గాయాలతో బయటపడ్డారన్నారు. మృతుడి భార్య, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంజీవ్

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 23: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడలను ప్రోత్సహిస్తూ ఆదరిస్తున్నారని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం జక్రాన్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మూడురోజుల పాటు జరిగే మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా గెలుపొందిన పాఠశాల క్రీడాకారులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి బహుమతులను అందజేశారు. డబుల్ బీటీరోడ్డు, సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరి గిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాటా



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే

డుతూ గడిచిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడలను పట్టించుకోలేదన్నారు. అమ్మ అదర్శ పాఠశాలల కమి టీల ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని, ఓడిన జట్లు భవిష్యత్‌లో జరిగే క్రీడల్లో పాల్గొని మంచి స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి గెలు పునకు కృషి చేయాలన్నారు. మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలను వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసినందున కోటి 25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రధానకార్యదర్శి వసంత్ రావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, సింగిల్ విండోల చైర్మన్‌లు పాల్గొన్నారు.

పోషక విలువలపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు23: పట్టణంలోని అశోక్‌నగర్, కాశీహన్మాన్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకవిలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ, గర్భిణీలు, బాలింతలకు తక్కువ ఖర్చుతో కూడిన ఎక్కువ పోషకలు ఉన్న ఆహారం గురించి వివరించారు. అనంతరం ఏడు నెలల పిల్లలకు అన్నప్రసాన, గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్‌లు సీహెచ్.సుజాత, ఎ.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అభినందన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని జిల్లా పరిషత్ రాంమందిర్ పాఠశాలలో క్రీడాకారులను సన్మానించారు. ఇటీవల అర్బన్ మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల్లో కబడ్డీ బాలుర విభాగంలో మొదటి బహుమతి, జూనియర్ వాలీబాల్ విభాగంలో ద్వితీయ బహుమతి, మార్చ్ పస్ట్‌లో కన్సోలేషన్ బహుమతి పొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీఎల్.చలం, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న మినీ స్టేడియం

● పరిశీలించిన అధికారులు



పరిశీలిస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 23: 2024-25 విద్యాసంవత్సరంనకు నిర్వహించే మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో నిర్వహించడానికి మండల ప్రధానోపాధ్యాయులు ఇటీవల మండల విద్యావనరుల కేంద్రంలో (ఎమ్మార్సీ) మండలవిద్యాధికారి ఎన్.ఆంధ్రయ్య అధ్యక్షతన అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో తీర్మానించారు. అయితే క్రీడోత్సవాల నిర్వహనకు తమవంతు సహకారం అందజేస్తామని స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ముందుకువచ్చింది. మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు సెప్టెంబరు 26, 27, 28 తేదీలలో ముడు రోజులపాటు నిర్వహిస్తామని ప్రకటించారు. మండలక్రీడల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కమ్మర్‌పల్లి హెచ్‌ఎం పసుపుల సాయన్న, స్థానిక పీడీ నాగభూషణం వ్యవహరిస్తారని ఎంఈవో తెలిపారు. కాగా క్రీడల నిర్వహణకు స్థానికంగా ఉన్న మినీ స్టేడియంను ఎంపిక చేశారు ఈ మేరకు సోమవారం ఎంఈవో ఎన్ ఆంధ్రయ్య, స్థానిక పీడీ నాగభూషణం, గ్రామ కమిటీ సభ్యులు గ్రామ యువకులు స్టేడియంను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కులకర్ణి సురేష్

వర్ని, సెప్టెంబరు 23 : వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా కులకర్ణి సురేష్ బాబా నియమితులయ్యారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వర్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులుగా మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, డైరెక్టర్‌లుగా నిమ్మలపూడి ఫుల్లజీ, మెగావత్ సంతోష్, గౌరారం రమేష్ గౌడ్, షేక్.హైమద్, వేములపల్లి సుధాకర్‌రావు, షేక్.మహబూబ్, పార్వతి, ప్రవీణ్, భట్టు నాగయ్య, లావణ్య, వంగ సాయాగౌడ్, మహేష్, గంగాధర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ ర్యాలీ

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలో విద్యానగర్ కాలనీ నుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు సోమవారం పీడీఎస్‌యూ స్వర్ణోతవ ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ప్రభాకర్‌లు మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల గొంతుక జార్జిరెడ్డి అని, ఎన్నో పోరాటాలు, త్యాగాలను, పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తిచేసుకొని స్వర్ణోత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమం మొదలై రెండు తెలుగు రాష్ట్రాల్లో అంచలంచెలుగా ఎదిగి విద్యార్థుల హక్కుల గొంతుగా పీడీఎస్‌యూ అవతరించిందని వారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు మాజీనాయకులు బి.దేవరాం, పీడీఎస్‌యు నాయకులు కర్క గణేష్, అనిల్‌కుమార్, నిఖిల్, మమత, సిద్ధర్థ, నితిన్, సాయి, వినయ్ పాల్గొన్నారు.

'రెండు లక్షల రుణమాఫీ వర్తించేయాలి'

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలమేరకు ప్రతి రైతు కుటుంబానికి 2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని హసాకొత్తూర్ రైతులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలోని రైతులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు రైతుభరోసా పథకంలో భాగంగా 7 వేల 500 విడుదల చేయాలన్నారు. ఖరీఫ్‌లో పండించే దొడ్డు, సన్నరకం వరికి 5వందల బోనస్ ప్రకటించాలని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలమేరకు ఆరుగ్యారంటీలను అమలు చేయాలని, లేని పక్షంలో రానున్నరోజుల్లో రైతుల అందోళనలు చవిచూడాల్సి వస్తున్నారు. సమావేశంలో చౌట్‌పల్లి సహకారసంఘం ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీధర్, మాజీ ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, గ్రామ రైతులు గడ్డం భూమన్న, సురకంటి రమేష్, ఏనుగు రమేష్, గంగారెడ్డి, గడ్డం రాజేశ్వర్, శంకర్, గంగాధర్, గడ్డం రవి, బంగ్లా శివా, రేవతి ప్రతాప్, పడిగెల అశోక్, గడ్డం రాజన్న పాల్గొన్నారు.

జాలరి వలకు చిక్కిన భారీ చేప

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 23: శ్రీరాంసాగర్ నుంచి వరదకాలువకు నీటి విడుదలతో భారీ చేపలు కొట్టుకువస్తున్నాయి. ఈ మేరకు కమ్మర్‌పల్లికి చెందిన ఊట్పూర్ రాజేష్ ఆదివారం రాత్రి వరదకాలు నీటికి అడ్డుగా వలకట్టడంతో సోమవారం ఉదయం చూడగా వలకు భారీ చేప చిక్కింది. అతి కష్టంమీద దాన్ని ఒడ్డుకు చేర్చాడు. బొత్స రకంచేప అన్నారు.

పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు

డొంకేశ్వర్, సెప్టెంబరు 23 : డొంకేశ్వర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కె టీం ఆధ్వర్యంలో సోమవారం కంటి సమస్యలు ఉన్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కండ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. బరువు తక్కువగా ఉన్న రక్తహీనత ఉన్నత విద్యార్థులకు గుర్తించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేందర్, ఆర్‌బీఎస్‌కె అధికారులు, మమత, పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ఇంటింటి జ్వర సర్వే

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి జ్వరసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ నీటి నిల్వలు ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని, దోమలు వృద్ధి చెంది మలేరియా, ఫైలేరియా, డెంగ్యు వంటి వ్యాధులు వస్తాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడేను డ్రైడేగా కచ్చితంగా పాటించాలని వారు సూచించారు. అర్బన్ యూపీహెచ్‌సీ అధికారి సాయి పాల్గొన్నారు.

కేర్‌టేకర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

ముప్కాల్, సెప్టెంబరు 23: మండల కేంద్రంలోని టీఎస్‌ఎంఎస్ బాలికల హాస్టల్‌లో కేర్‌టేకర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఈనెల 24నుంచి 26సాయంత్రం వరకు దర ఖాస్తు స్వీకరించబడునని, ఆసక్తి గల వారు స్థానికులైన 35ఏళ్ళ మహిళలు మాత్రమే కంప్యూటర్ పరిజ్ఞానం, డిగ్రీ, బిఈడీ ఉత్తీర్ణులై ఉండా లని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 7731913778నెంబర్‌కు సం ప్రదించాలని తెలిపారు.

పసుపు పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్త

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు23: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో సోమవారం పసుపు పంటలను వ్యవసాయ శాస్త్రవేత్త మహేందర్, ఉద్యనవన శాఖ అధికారిణి సంధ్యా పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రధాన ఉద్యన పంట అయిన పసుపునకు రైతులు చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పసుపు పంటలో ప్రధానంగా దుంపకుళ్ళ తెగుళ్లు, తాటకు మచ్చ తెగులు, ఆకు మూడత తెగులు, కొన్ని సందర్భాల్లో దుంప ఈగ వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు ముందస్తు చర్యగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దంపకుళ్ల సోకడం వల్ల కాండంపై నీటితో తడిసిన మచ్చలు ఏర్పడి మెత్తగా మారుతుంది. క్రమేపి దుంపలు కుళ్ళిపోతాయి. ఆకుల, కొమ్మలు మడి ఎండిపోతాయి. దీని నివారణకు రీడోమిల్ రెండు గ్రాములు లేదా క్యాప్టన్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల చుట్టు నెల తడిచేలా మొక్క కాండం వద్ద పిచికారి చేయాలని సూచించారు.

నగరంలో రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

ఖిల్లా , సెప్టెంబరు 23: నగరంలోని ఒకటోటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గల ఇస్లాంపుర ప్రాంతంలో రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖాధికారులు సోమవారం రాత్రి దాడి చేశారు. నగరానికి చెందిన పప్పు అనే వ్యక్తి పెద్దఎత్తున గంజాయి కొనుగోలు చేసి నగరానికి తరలిస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం వద్ద పట్టుబడ్డాడు. అక్కడ పట్టుకున్న అధికారులు జిల్లా కేంద్రంలో ఆయన నివాసం ఉండే ఇంట్లో సైతం అక్రమ గంజాయి నిలువ ఉంటుందనే అనుమానంతో ఇంటిలో సోదాలు నిర్వహించారు.

రోడ్డు కబ్జా చేసిన వ్యక్తిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

భీమ్‌గల్, సెప్టెంబరు23: పట్టణ కేంద్రంలోని పదోవార్డులో రోడ్డు కబ్జా చేసి గోడ నిర్మించిన ఇబ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో తాగునీటి అవసరాల కోసం తమ పూర్వీకుల నుంచి ఉన్న బావిని ఇబ్రాయిల్ అనే వ్యక్తి అక్రమంగా కూల్చివేసి గోడను నిర్మించి చర్చిని నడుపుతూ తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఈ విషయమై 31అక్టోబర్ 22న మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా అట్టి గోడను వారం రోజుల్లో తొలగించాలని నోటీసులు జారీ చేశారని, అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్‌కు తెలిపారు. రోడ్డును కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోని మంచినీళ్ళ బావిని రోడ్డును పునరుద్ధరించాలని కోరారు.

మహాలక్ష్మీ గ్యారంటీ పత్రాలు అందజేత

భీమ్‌గల్, సెప్టెంబరు 24: పట్టణ కేంద్రంలోని 5, 6వార్డులలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నాగేంద్ర ఆధ్వర్యంలో సోమవారం మహాలక్ష్మీ పథక లబ్ధిదారులకు గ్యారంటీ మంజూరు పత్రాలను అందజేశారు. మహిళపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు రూ.500లకే మహాలక్ష్మీ పథకం ద్వారా వంట గ్యాస్ సిలిండర్ అందించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని స్వామి నాగేంద్రలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు సురేష్, మొండి చరణ్, 5, 6వార్డుల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు వాటర్ ట్యాంకు వితరణ

ముప్కాల్, సెప్టెంబరు 23: ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు 6వ తరగతి చదువుతున్న అశ్విత తండ్రి రాజేందర్ 500 లీటర్ల వాటర్‌ట్యాంకు సోమవారం పాఠశాలకు వితరణ చేశారు. పిల్లలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న తెలుసుకొని వాటర్ ట్యాంకును అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వినోద రాజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, దాత రాజేందర్ పాల్గొన్నారు.

బాల్కొండ పాఠశాలకు కుర్చీల వితరణ

ముప్కాల్, సెప్టెంబరు 23: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం పూర్వవిద్యార్థులు రామకృష్ణ 21 కూర్చిలను అందజేశారు. పాఠశాలలో కూర్చిల కొరతను గమనించిన రామకృష్ణ తనవంతు సహాయంగా పూర్వవిద్యార్థులు రహీమొద్దిన్, రాజేందర్‌లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్, త్రీఫేజ్ మోటార్లను వినియోగించాలి

కోటగిరి, సెప్టెంబరు 23: గ్రామాలలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన సింగిల్, త్రీఫేజ్ మోటార్లను సమర్థవంతంగా వినియోగించాలని బోధన్ మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్ సూచించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. తొలిరోజు సింగిల్ ఫేజ్, త్రీఫేజ్‌ల మోటార్ల వినియోగంపై అవగాహన కల్పించారు. సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్‌లలో విద్యుత్ వైర్లు, ఓల్టేజీ, పవర్‌డెవలరీ, విద్యుత్ అంతరాయంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా కంటే త్రీఫేజ్ మోటార్ సప్లై సమర్థవంతంగా పని చేస్తుందని వివరించారు మోటార్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ తాగునీరు వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్‌ల లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలని, సమస్య తీవ్రంగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ డీఎల్‌పీవో మధుకర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏఈ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

శేషాద్రి ఫారంలో 10 ట్రిప్పుల ఇసుక డంప్ సీజ్

కోటగిరి, సెప్టెంబరు 23: పొతంగల్ మండలంలోని హెగ్డోలి పంచాయతీ పరిధిలో గల శేషాద్రిఫారం, సుంకిని గ్రామాల మధ్య రహస్యంగా డంప్ చేసిన ఇసుక డంప్‌ను తహసీల్దార్ మల్లయ్య సీజ్ చేశారు. సుంకిని గ్రామం నుంచి కొందరు అక్రమార్కులు ట్రాక్టర్లలో సుమారు 10ట్రిప్పుల ఇసుకను డంప్ చేసినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు ఇసుక డంప్‌ను సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. ఇసుక అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంటపొలాల పరిశీలన

బోధన్ రూరల్, సెప్టెంబరు 23: బోధన్ మండలంలోని పెంటాఖుర్దు క్యాంప్, కుమ్మన్‌పల్లి, సాలంపాడ్ క్యాంప్ గ్రామాలలోని వరిపంటలను సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. వరిపంటకు ఆశించిన బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు, సుడి దోమ ఆశించిన పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏఈవో సాయిచరణ్ మాట్లాడుతూ రైతులు వరిపంట పొలాల్లోని సుడిదోమ నివారణకు డైనోటెస్ట్రియూరన్ 80గ్రాములు లేదా పైమెట్రోజైన్ 120 గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పిచికారి చేసే ముందు పంట పొలాల్లోని నీటిని తీసివేయాలన్నారు. బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు నివారణకు పొంటామైసిన్ 80గ్రాములు, అగ్రిమైసిన్ 80గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. రైతులు తమ పంట పొలాలను సుడిదోమ నుంచి కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో బోధన్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, రైతులు వెంకటేశ్వర్ రావు, రాజా, శ్రీకాంత్, సుబ్బారెడ్డి తదితులు పాల్గొన్నారు.

పేదలకు, వికలాంగులకు దుప్పట్ల పంపిణీ

బోధన్‌రూర్యాల్, సెప్టెంబరు 23: బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో పేదలు, వృద్ధులకు, వికలాంగులకు, అంధులకు సోమవారం వాసవీ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ శాంతిశ్రీ మాట్లాడుతూ వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నిరుపేదలకు ఎప్పుడు అండగా ఉంటుందని, వాసవీ క్లబ్ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ డాక్టర్ సూర్యరావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మహజన్ రాణి, వ్యాపారవేత్త ప్రకాష్ గుప్తా, కంటాల రమేష్, బిల్లకంటి అనిల్, రామకృష్ణ, గంగాధర్, లయన్స్ ప్రతినిధులు గబాలే జయశ్రీ, సీహెచ్.పద్మ, వాసవీక్లబ్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన నాయకులు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: బోధన్ సబ్‌కలెక్టర్‌ను సోమవారం బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్యదాము, వైస్ చైర్మన్ చీల శంకర్‌లతో డైరెక్టర్‌లు సబ్‌కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అంకుసంధ్య దాము మాట్లాడుతూ బోధన్ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని సందర్శించాలని, రైతులకు, మార్కెట్ కమిటీకి సహాయ, సహకారాలు అందిస్తూ రైతులకు పలు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 23: కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నాగాపూర్ గ్రామానికి చెందిన పాలెపు నర్సయ్యను ప్రభుత్వం ప్రకటించడంతో సోమవారం కమ్మర్‌పల్లిలో మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు నూతన చైర్మన్ పాలెపు నర్సయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం సభ్యులు ఆమెడ డిష్ నరేందర్, ఆమేటి శంకర్, నీలి వేణుగోపాల్, మర్యాల నాగభూషణం, జొన్నల భూషన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇందల్వాయి, సెప్టెంబరు 23: డ్రైవర్ అజాగ్రత్త తో వాహనం నడపడం వల్ల ఓ నిండు ప్రాణం బలికొనడమే కాకుండా మరొకరిని అవిటి వారిని చేసింది. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గన్నారం ముఖద్వారం వద్ద 44వ జాతీయ రహ దారిపై సోమవారం ఉదయం కామారెడ్డి వైపు నుంచి టోల్‌ప్లాజా వైపు వస్తున్న లారీ గన్నారం గ్రామం నుంచి కుర్ర చిన్న బుజ్జి మల్లయ్య, అతని భార్య గంగవ్వలు తమ ద్విచక్రవాహనంపై ఇంద ల్వాయి వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. గంగవ్వ అక్క డికక్కడే మృతి చెందగా చిన్న బుజ్జి మల్లయ్య కాలు నుజ్జు నుజ్జు అయింది. వెంటనే స్థానికులు చికిత్స కోసం మల్లయ్యను నిజామాబాద్ జిల్లా కేం ద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గన్నా రం ముఖద్వారం వద్ద తరుచూ ప్రమాదాలు జరు గుతూ ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఎన్ని సార్లు టోల్‌ప్లాజా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు సైతం గన్నారం నుంచి ఇందల్వాయి వెళ్లేందుకు జాతీయ రహదారి పక్క నుంచి వేరే తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయాలని మొరపెట్టుకున్నప్పటికీ రోడ్డు ఏర్పాటు చేయడం లేదంటూ వాపోయారు. ఇప్పటికైనా అధి కారులు, ప్రజాప్రతినిధులు గన్నారం గ్రామ ప్రజల సౌక ర్యార్థం ప్రత్యమ్నాయ రోడ్డు ఏర్పాటు చేయా లని అన్నారు. ప్రమాదానికి గురైన మల్లయ్యను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించా రని, గంగవ్వ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మృతిచెందిన గంగవ్వ

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఇందల్వాయి, సెప్టెంబరు 23: ఇందల్వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం సోమవారం స్థల పరిశీలన చేసినట్లు తహసీల్దార్ వెంకట్‌రావు తెలిపారు. తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీకి 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో దాని నిర్మాణం కోసం గ్రామ పంచా యతీ పరిధిలో రెండు ఎకరాలు స్థలాన్ని పరిశీలించామని ఇక్కడ సబ్‌స్టేషన్ నిర్మా ణానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ నివేదికను పై అధికారులకు పంప నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తిర్మన్‌పల్లి గ్రామ స్తుల ఎన్నో సంవత్సరాల కల ప్రస్తుతం నెరవేరనుందని గ్రామానికి సబ్‌స్టేషన్ మం జూరు చేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంట ఆర్ఐ మోహన్, గ్రామపెద్దలు మాజీ ఎంపీటీసీ చింతలదాస్, కిషన్, బీరీష్, గంగాధర్, ప్రభాకర్, సంతోష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వరి పంటలకు సుడిదోమ వ్యాప్తి అధికం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 23 : రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పంటకు సుడి దోమ బ్యాక్టీరియా, అగ్గితెగుళ్లు, కంకినల్లి, ఎండు ఆకుతెగులు ఆశిస్తు పంటలకు తీవ్రనష్టం చేసున్నాయని ఈ బ్యాక్టీరియ నివారణకు రైతులు వ్యవసా యాధికారుల సలహాలు తీసుకొని నివారణ చర్యలు చేపట్టాలని నిజామాబాద్ రూర ల్ ఏడీఏ కుమార్ రైతులకు సూచించారు. యానంపల్లిలో వరి పంటలకు సోకు తున్న తెగుళ్ల గురించి నివారణ చర్యలు అవగాహన సోమవారం కల్పించారు. రైతులు ఏఏ సమయంలో ఎంత మోతాదులో రసాయనాలు వాడాలో రైతాంగానికి తెలియజేశారు. రైతులు సనాతన పద్దతులకు స్వస్తి పలికి ఆధునిక పద్దతులలో నివారణ చర్యలు తీసుకోవలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

మహలక్ష్మి పథకం మహిళలకు వరం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 23: కాంగ్రెస్ పథకం ఎన్నికల్లో ఇచ్చిన హమీలను విడతల వారిగా నేరావేరుస్తు ముందుకు వెళ్తుందని, మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అం డగా నిలబడాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి త్రిపురనేని సాయిప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని ధర్మారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఈదర పిచ్చయ్య, నాగేశ్వరావు, శాకటి మురళితో కలిసి మహిళలకు సిలిండర్ సబ్సీడీ పత్రాలు మం జూరు చేశారు.

ఘన్‌పూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 23 : మండలంలోని ఘన్‌పూర్ చైతన్యనగర్ కాలనీలో సోమవారం ఉపాధిహామీ నిధుల ద్వారా మంజూరైన 5లక్షల రూపాయల విలువ చేసే సిమెంట్ రోడ్డుపనులు మండల యువజన కాంగ్రెస్ నాయకుడు చౌకి వెంకటేశ్, మండల కాంగ్రెస్ మహిళా అధ్య క్షురాలు దేవకరునలు కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి అన్నిరంగాల్లో ముందుకు సాగుతుందని ఇందుకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారం మండల నాయకుల సహకారం మరువ లేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరి రమేశ్, కాంగ్రెస్ ప్రతి నిధులు శంకర్ గౌడ్, గంగాధర్, సాగర్, గోపి, పోశెట్టి, లక్ష్మీ, సదానంద్ వీడీసీ పాల్గొన్నారు

బీఈడీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

డిచ్‌పల్లి, సెప్టెంబరు 23 : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ 4వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఫలితాలను తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని వారు పేర్కొన్నారు. త్వరలో డీఎస్సీ మెరి ట్ జాబితా విడుదల అయ్యే ఆవకాశం ఉండటంతో బీఈడీ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులకు ఇబ్బంది రాకూడదని త్వరగా ఈ ఫ లితాలు విడుదల చేసినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన

డిచ్‌పల్లి, సెప్టెంబరు 23 : మండలంలోని రాంపూర్ , యానంపల్లి తండా, దూస్‌గాం గ్రామాల్లో సోమవారం సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రజలకు జిల్లా మలేరియ అధికారి తుకారం రాథోడ్, ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం వైద్య సిబ్బంది నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ దోమల నివారణకు రసాయన మందును పిచి కారి చేయించారు. డెంగ్యూ, మలేరియ, చికున్‌గున్యా, ఫైలేరియ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్‌సూపర్‌వైసర్ శంకర్ సూచించారు. దోమల పెరుగుదల గాకుండా ఎప్పటికప్పుడు రసాయ నాలు చల్లాలని నీటి నిల్వ ప్రాంతాల్లో అయిల్ బాల్స్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డి.శ్రీనివాస్ స్మారక క్రీడాపోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 23:డి. శ్రీనివాస్ స్మారక క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో సోమవారం పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ కార్య వర్గసభ్యులు ధర్మపురి సురేందర్ ప్రారంభించారు. క్రీడాపతాకాన్ని ఆవిష్కరించి క్రీడా కారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మార్చ్‌ఫాస్ట్‌లో జిల్లాలోని వివిధ పాఠ శాలల క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. మార్చ్‌ఫాస్ట్‌లో మొదటి విజే తగా విజయ హైస్కూల్, రెండో విజేతగా బాల్కొండకు చెందిన కేజీబీవీ బాలికలు నిలిచారు. వీరికి నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ బహుమతులు అందజేశారు. అనంతరం క్రీడాపోటీలను ప్రారంభించారు. మొదటి రోజు వాలీబాల్ క్రీడల్లో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ధర్మపురి సం జయ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో క్రీడాకారులను వెలికితీసేందుకే ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుమారు నాలుగువేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్, బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ప్రారంభమైన క్రీడలు 27వ తేదీన ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమో షన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు డి.సాయిలు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరి నాగమణి, వ్యాయా మ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నిజామాబాద్, సెప్టెంబర్ 23 : తెలంగాణ ట్రెజరిస్, అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నూతన కలెక్టరేట్‌లోని ట్రెజరీహాల్‌లో నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశాన్ని అధ్యక్షులు రాము లు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ట్రెజరీ డిపార్ట్‌మెంట్ సమస్యల గురించి చర్చించారు. కార్యక్రమానికి తెలతతతరదతపవ˘తత రవపదతవతెలంగాణ ట్రెజరీ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గండల పురుషోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరుశురాం, ఇతర కార్యవర్గసభ్యులు సాయిరెడ్డి, శ్రీనివాస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, టీటీఎస్‌జీవోఏ అధ్యక్ష, కార్యదర్శులు మారుతి, కార్తీక్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్ట శ్రీవాస్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ట్రెజరరీ సభ్యులున్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

పెద్దబజార్, సెప్టెంబరు 23:కార్మిక చట్టాలను రక్షించాలని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నాచౌక్‌లో సోమ వారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మిక చట్టా లను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉన్నటువంటి 29 చట్టాలను కేంద్రం రద్దు చేసిందని, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని వారు ఆరోపించారు. స్వదేశీ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఈ చట్టాలు ఉన్నాయని వారు ఆరోపించారు. వామ పక్షాలు డిమాండ్ చేసిన పట్టించుకోలేదని విమర్శించారు.

మంచిప్ప చెరువుకు బుంగ



మంచిప్ప చెరువుకు బుంగపడి వృథాగా పోతున్న నీరు

మోపాల్, సెప్టెంబరు 23:మండలంలోని మంచిప్ప చెరువుకు బుంగపడి నీరు వృథాపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆయా గ్రామాల రైతులు మండి పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మంచిప్ప చెరువు నిండిపోయింది. ఈ చెరువు నిజామాబాద్ నగర ప్రజల తాగునీటి అవసరాలను తీరుస్తుంది. బంగపడి నీరు వృథా పోతున్నా ఇటువైపు సంబంధిత శాఖ అధికారులు కన్నెత్తి చూడలేకపో తున్నారని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు నీరు తాగునీరు, సాగునీరుకు ఎంతో ఉపయోగపడుతుందని చుట్టుపక్కల గ్రామస్తులు, రైతులు తెలి పారు. నైజాం కాలంలో మంచిప్ప చెరువును నిర్మించారని గ్రామస్తులు వివరించారు. ఈ చెరువు నిండటంతో అలుగుపారిన నీరంతా వృథా పోకుండా కులాస్‌పూర్ చెరువు, ముదక్‌పల్లి చెరువు, మోపాల్ చెరువు తదితర గ్రామాల చెరువులకు నీరు చేరుతుంది. బుంగపడి నీరు వృథా పోవడంతో రైతులు, ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కోటగిరి, సెప్టెంబరు 23: పోషక విలువలు కలిగిన ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని బోధన్ ఐసీడీఎస్ సీడీపీవో జానకి పేర్కొన్నారు. పొతంగల్ మం డల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ అభియాన్ కార్యక్రమం ని ర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో జానకి మాట్లాడుతూ గర్భిణీలు, తల్లులు ఆ కు కూరలు, చిరుధాన్యాలు, కూరగాయలు వంటి పోషకాహారాన్ని సమపాలల్లో తీసు కోవాలని సూచించారు. తద్వారా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. బాలింతలు, గ ర్భిణీలు, కిషోర బాలికల్లో రక్తహీనత తగ్గించడంపై అవగాహన కల్పించారు. అనంత రం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమం ని ర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మణి, సుమలత, అంగన్‌వాడీ కార్య కర్తలు బాలలక్ష్మి, సుజాత, జ్యోతి, జయశ్రీ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నగరంలో దుప్పట్ల పంపిణీ

పెద్దబజార్, సెప్టెంబరు 23: భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సేవా మహోత్సవంలో భాగంగా నగరంలోని రైల్వేస్టేషన్‌లో పేద లకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం దుప్పట్లు పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధానిగా మూడో సారి నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టి ప్రపంచంలోనే గొప్ప నాయకుడిగా ఎది గారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

చెవుడు నివారణపై అవగాహన

ఇందల్వాయి, సెప్టెంబరు 23 : పుట్టిన పిల్లల్లో సంవత్సరంలోపు కొందరికి చెవుడు ఉంటుందని దీంతో మాట కూడా పోయే ప్రమాదం ఉందని ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సంతోష్ అన్నారు. దీని నివారణ కోసం ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందని, చెవుడు ఉన్న పిల్లలను గుర్తించి సరైన చికిత్స అందిస్తే వారు మామూలు స్థితికి చేరుకోవచ్చని అన్నారు. సోమ వారం ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్ వాడి కార్యకర్తలు, ఆశకార్యకర్తలకు చెవుడు నివారణ మరియు నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి, సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కలిసిన గ్రామస్తులు

మోపాల్, సెప్టెంబరు 23: నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియ మితులైన ముప్పగంగారెడ్డిని ముదక్‌పల్లి గ్రామస్తులు సోమవారం కలిసి సన్మానించారు. వీరితో పాటు రూరల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు కలిసి సన్మానించారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించడం జరుగుతుందని గంగారెడ్డి తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిరసన

సుభాష్‌నగర్, సెప్టెంబరు 23: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసి జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం డిపో-1 ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జేబులకు నల్లబ్యాడ్జీలు పెట్టుకొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు సాయిలు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వరంగ రవాణా సంస్థలను ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లింబాద్రి, తదితరు లు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన యువకుడికి దేహశుద్ధి

ఖిల్లా, సెప్టెంబరు 23 : నగరంలోని ఒకటోటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గల సీఎం రోడ్డులో గల మదర్సా సమీపంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబ డి చోరీకి యత్నించిన యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన సోమవారం జరిగింది. సీఎంరోడ్డుకు చెందిన వాజిద్‌ఖాన్ తన పిల్లలను స్కూల్ నుంచి తీసుకుని రావడానికి ఇంటికి తాళం వేసి వెళ్లా డు. దీనిని గమనించిన గుర్తుతెలియని యువకుడు తాళం పగులగొట్టి ఇం ట్లోకి చొరబడ్డాడు. ఇంట్లో గల బీరువాను సైతం ధ్వంసం చేసి అందులోని బం గారు ఆభరణాలను అపహరించేందుకు యత్నించాడు. అదే సమయంలో వాజిద్‌ఖాన్ పిల్లలను తీసుకుని ఇంట్లోకి రాగానే యువకుడు గమనించి తప్పించుకునే ప్రయత్నంలో ఆయనపై కత్తితో బెదిరించాడు. అనంతరం పారి పోతుండగా అప్రమత్తమైన స్థానికులు చాకచక్యంగా యువకుడిని పట్టుకు న్నారు. యువకుడిని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చోరీకి వచ్చిన యువకుడిని డైరీఫార్మ్‌కు చెందిన నసీర్‌గా గుర్తించారు. పోలీసులు కేసు విచా రణ జరుపుతున్నారు.

విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని వినతి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 23: విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యా సంస్థలకు ఈటెక్నో, టెక్నో అనే తోక పేర్లతో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహి స్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాంలు మాట్లాడుతూ విద్యాహక్కు చట్ట నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అదే విధంగా పాఠ శాల టైమింగ్‌ను మార్చాలన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 8గంటల వరకు విద్యార్థులకు క్లాసులు బోధిస్తూ ర్యాంకుల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గూపన్‌పల్లిలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో హాస్టల్ పర్మిషన్ లేకుండానే హాస్టల్ నిర్వహిస్తున్నారన్నారు. సరిపడా సౌకర్యాలు లేకున్నా వేల ల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, సు జాత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌ను కలిసిన ముప్ప గంగారెడ్డి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 23:నిజామాబాద్ మార్కెట్ కమిటీ అధ్య క్షుడిగా నియమితులైన ముప్ప గంగారెడ్డి సోమవారం రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్‌ను నిజామాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా తన నియామకం కోసం కృషి చేసిన తాహెర్‌బిన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సన్మానించారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా

సుభాష్‌నగర్, సెప్టెంబరు 23: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నగ రంలోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి చెత్తను శుభ్రం చేశారు. అంతేకాకుండా నగరంలోని ముబారక్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యా ర్థులతో మానవహారం నిర్వహించారు. నగరంలోని 18వ డివి జన్‌లో వన మహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ భూమిని కబ్జా నుంచి కాపాడండి'

ధర్పల్లి, సెప్టెంబరు 23 : మండల కేంద్రంలో గల జగన్నాథ ఆలయ ఆవరణలో ఉన్న భూమిని కబ్జా నుంచి కాపాడా లని తహసీల్దార్ మాలతికి సోమవారం ధర్పల్లి వీడీసీ కమిటీ విన తిపత్రం అందజేసింది. జగన్నాథ ఆలయ ఆవరణలో ఉన్న భూమి కబ్జాకు గురవుతున్నట్లు తెలిపారు. సర్వే నిర్వహించి ఆలయానికి భూమి ఎంత ఉందో సర్వే చేసి ఇవ్వాలన్నారు. దేవుని భూమి కబ్జాకు గురైతే సంబంధిత భూమిని ఆల యానికి తిరిగి అప్పచెప్పే విధంగా చూడాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మహేందర్, బాలయ్య, అశోక్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం పార్టీలోకి బీఆర్ఎస్ నాయకులు

ఖిల్లా, సెప్టెంబరు 23 : బీఆర్ఎస్ మైనార్టీ విభాగంలో కీల కంగా వ్యవహరించిన కొందరు బీఆర్ఎస్ నాయకులు ఎంఐ ఎం పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదొద్దీన్ ఓవైసీ సమ క్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీడిప్యూటీ మేయర్ మీర్‌మజాజ్‌అలీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ నాయకుడు అమర్‌ఫారూఖీలు పార్టీలో చేరా రు. వీరిని ఎంఐఎం పార్టీ జిల్లా ఇన్‌చార్జి భైంసా మున్సిపల్ వైస్‌చైర్మన్ జాబిర్‌అహ్మద్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, నగ ర పార్టీ అధ్యక్షుడు షకీల్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా ఎంపీ అసదోద్దీన్ ఓవైసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జి మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్‌బలాల, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఖిల్లా, సెప్టెంబరు 23 : నగరంలోని ఐదోటౌన్ పోలీసు స్టేష న్ పరిధిలో గల సాయినగర్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,390నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. ఖచ్చిత మైన సమాచారం మేరకు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగనే వార్ ఆదేశాలపై సాయినగర్ పేకాట స్థావరంపై దాడి చేశా రు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేయడం జరిగిందన్నారు. దాడిలో ఏఎస్ఐ రమేష్, సిబ్బంది ఆనంద్, గంగాధర్‌లు పాల్గొ న్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన మలేరియా అధికారి

పెద్దబజార్, సెప్టెంబరు 23: నగరంలోని దుబ్బ ఆసుపత్రిని సోమవారం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్‌పాల్ తనిఖీ చేశారు. శాస్త్రినగర్‌లో డెంగ్యూ కేసులు ఎక్కువ కావ డంతో కాలనీలోని పలు ఇండ్లను పరిశీలించారు. మలేరియా, ఇతర వ్యాధులు రాకుండా ఉండేందుకు దోమలను నివారిం చేందుకు ఫోకల్ స్ప్రే చేయాలని కోరారు. ఆయన వెంట డీఎం అండ్ హెచ్‌వో రాజశ్రీ, అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, జిల్లా మ లేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్‌తో పాటు వైద్యులు శ్రీలత, సిబ్బంది ఉన్నారు.

క్రీడల్లో గుండారం విద్యార్థుల ప్రతిభ

మోపాల్, సెప్టెంబరు 23: నగరంలోని నాగారం మైదా నంలో నిర్వహించిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో సాం స్కృతిక ప్రదర్శన విభాగంలో రూరల్ మండలంలోని గుండా రం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబ ర్చారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసిన పదోతరగతి ఎన్‌సీసీ క్యాడెట్స్ లాస్య, కృష్ణవేణి, యశస్వినిలు ప్రతిభకనబర్చి సీవో చేతుల మీదుగా పతకాలు స్వీకరించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. ప్రతిభకనబర్చిన విద్యార్థినిలను పాఠశాల ఆవరణలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు అహల్య అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఎన్‌సీసీ అధికారి శ్రీపాద్‌ను అభినందించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఇందల్వాయి, సెప్టెంబరు 23:ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామానికి చెందిన రాంపూర్ గంగాధర్ అనే యువ కుడు తన వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మ తులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాల పాలైనట్లు స్థానికులు తెలిపారు. ఫీజ్ వైరు పోవడంతో దానిని వేసేందుకు ప్రయత్నించగా విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. గంగాధర్‌ను స్థానికులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసు పత్రికి తరలించారు.

పీడీఎస్‌యూ గోడప్రతుల ఆవిష్కరణ

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ స భ గోడప్రతులను సోమవారం బోధన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ పీడీఎస్‌యూ నాయకులు శివరాజ్ మా ట్లాడుతూ విద్యార్థి అమరవీరుల అమరత్వం స్ఫూర్తితో బల మైన విద్యార్థి విప్లవ ఉద్యమాలను నిర్మించాలని శాస్త్రీయ వి ద్యా విధానం కోసం, సమసమాజ నిర్మాణం కోసం నేటి తరం విద్యార్థులు పోరాడాలని పీడీఎస్‌యూ మాజీ నాయకులు శివ రాజ్ అన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.76400	రూ.70500	రూ.925

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పైలం పిలగా (1.15)
: మత్తు వదలరా-2 (4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (3డి ఇంగ్లీష్) (11.00, 4.35)
: యుద్ర (హిందీ) (1.30, 7.05)
: గొర్రె పురాణం (10.10)
స్క్రీన్-3 : మత్తు వదలరా-2 (12.50)
: సరిపోదా శనివారం (3.50, 10.30)
: యుద్ర (హిందీ) (7.25)
స్క్రీన్-4 : చీక్‌లెట్స్ (తెలుగు) (10.25)
: తుంబడ్ (హిందీ) (1.05)
: మనం (3.45)
: మాయాబజార్ (7.10)
: స్త్రీ-2 (హిందీ) (11.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 35-చిన్నకథ కాదు (4.30)
: మత్తు వదలరా-2 (7.20, 10.25)
స్క్రీన్-2 : సరిపోదా శనివారం (1.30, 7.25)
స్క్రీన్-3 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (ఇంగ్లీష్ 3డి) (11.00, 4.40, 10.35)

దేవి : మత్తు వదలరా-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: యుద్ర (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: బొమ్మరిల్లు (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శని వారం (11.15, 2.15, 6.15, 9.15)

\- నిజామాబాద్ అర్బన్